క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

కలువాయి(సైదాపురం): మండలంలోని కుల్లూరులో పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత అచ్యుత స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బాలాయపల్లి(సైదాపురం): ప్రతి ఒక్కరికీ దిన చర్యల్లో యోగా ఒక భాగం కావాలని వెంగమాంబపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణకుమారి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కళాశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగ సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ కె.శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, మునీంద్ర పాల్గొన్నారు.

నెల్లూరుపల్లి వీఆర్‌ఏ మృతి


చిన్నయ్య(ఫైల్)

దొరవారిసత్రం: మండలంలోని నెల్లూరుపల్లి గ్రామ వీఆర్‌ఏ చిన్నయ్య(57) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శైలకుమారి, రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. ఆయన భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు రూ.15 వేలు అందజేశారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాపూరు: చాగణం లలితమ్మ,భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాపూరులో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యులు మానస, తనూజ సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 80 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 75 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు.

రైతులకు డ్రోన్ల పంపిణీ


డ్రోన్‌ను అందజేస్తున్న అధికారులు

వాకాడు : వాకాడు–1 రైతు సేవా కేంద్రంలో అధికారులు గురువారం పంటలపై పురుగు మందులు వెదజల్లేందుకు వినియోగించే డ్రోన్లను రైతులకు అందజేశారు. ఏవో దీప మాట్లాడుతూ గ్రామానికి చెందిన సీహెచ్ అనే రైతు గ్రూపునకు 80 శాతం రాయితీతో లోకసాయి డ్రోన్ అందజేసినట్టు తెలిపారు. 12 లీటర్ల నీటిలో కలిపిన పురుగు మందును కూలీల సాయం లేకుండా డ్రోన్‌తో పొలంలో సులువుగా వెదజల్లవచ్చన్నారు.

గోతిలో పడిన దూడ



చిల్లకూరు: మండలంలోని బల్లవోలు పంచాయతీ కోరావారిపాళెంలో పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు రెండు నెలల క్రితం కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి గోతులు తవ్వి వదిలేశాడు. దీంతో మూగ జీవులు వాటిలో పడుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం గేదె దూడ గోతిలో పడింది. గమనించిన స్థానికులు దాన్ని రక్షించేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది.

రేషన్ బియ్యం స్వాధీనం



నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణం పాత శివాలయం వీధిలో నివాసం ఉంటున్న కంప రమేష్ ఇంటి నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నాయుడుపేట సీఐ బాబి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో కలిసి దాడి చేసి వాహనాన్ని, 50 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మోగిన బడి గంటలు


వాకాడు: తొలిరోజు విద్యార్థులు లేక వెల వెలబోయిన వాకాడు ప్రభుత్వ పాఠశాల

వేసవి సెలవుల అనంతరం బడి గంట మోగింది. గురువారం పౌర్ణమి పాడ్యమి కావడంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నామమాత్రంగా కనిపించింది. దీనికి తోడు ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో విద్యా సామగ్రిని తీసుకుని వెళ్లేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో జిల్లా కేంద్రాల నుంచి వచ్చిన విద్యా సామగ్రి స్టాక్ పాయింట్లలోనే వుండిపోయింది. పిల్లలకు పుస్తకాలు, బూట్లు, బ్యాగు అందలేదు. అలాగే యూనిఫాం ఊసే ఎత్తకపోవడంతో గత ఏడాది ఇచ్చిన యూనిఫాంతోనే పిల్లలకు బడికి హాజరయ్యారు.

–చిల్లకూరు/వాకాడు/సైదాపురం/ఓజిలి/దొరవారిసత్రం/సూళ్లూరుపేట రూరల్/పెళ్లకూరు/వెంకటగిరి రూరల్/తడ

- అరకొర విద్యార్థులే హాజరు
- అందని విద్యా సామగ్రి
- అడ్మిషన్లకు పాడ్యమి అడ్డంకి
- తల్లికి వందనం ప్రకటనలకే పరిమితం

• సైదాపురం మండలంలోని పలు పాఠశాలల్లో పిల్లల సంఖ్య తక్కువగా కనిపించింది. గురువారం పాడ్యమి కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరుకాలేదు. సైదాపురం ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుతుండగా పదో తరగతిలోకి అడుగు పెట్టిన 8 మంది మాత్రమే హాజరయ్యారు. కొన్ని పాఠశాల్లో ఆరుగురు, ఏడుగురు పిల్లలతోనే పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.

అయోమయంలో తల్లిదండ్రులు

గత ప్రభుత్వం ఇంగ్లీషు విద్య అందించే క్రమంలో 3 నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలల్లోనే తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం దాన్ని తిరోగమన దిశకు చేర్చేలా చర్యలు చేపట్టింది. ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులను తిరిగి స్థానికంగా ఉండే ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. కొంత మంది తల్లిదండ్రులు తమ బిడ్డల ధ్రువీకరణ పత్రాలు తీసుకునేందుకు ఉన్నత పాఠశాలలకు పరుగులు తీయాల్సి వచ్చింది.

మౌలిక వసతులూ కరువే

గత ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభం నాటికే అన్ని వసతులూ కల్పించింది. అలాగే మరికొన్ని పాఠశాలల్లో నాడు–నేడు కింద పనులు ప్రారంభించింది. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాడు–నేడు పనులను నిలిపివేసింది. తద్వారా పిల్లలకు మౌలిక వసతులు ఉత్త మాటలుగానే మిగిలిపోనున్నాయి. భవనాలు, మరుగుదొడ్లు, క్రీడా మైదానాల గురించి ఊసెత్తకపోవడం గమనార్హం.

అన్నీ అరకొరే

గత ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థికి అవసరమైన పుస్తకాలు, బ్యాగు, బూట్లు, టై, యూనిఫాం అందించింది. కూటమి ప్రభుత్వంలో అన్నీ అరకొరగానే చేపట్టింది. విద్యార్థికి అవసరమైన పుస్తకాలను పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ప్రతి తరగతిలోనూ ఒక సబ్జెక్టు పుస్తకాలు తక్కువగా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. యూనిఫాంకు సంబంధించిన గుడ్డ ఇప్పటికీ రాలేదు.



సైదాపురం ఉన్నత పాఠశాలలో హాజరైన పదో తరగతి విద్యార్థులు, వాకాడు: పాత యూనిఫాంలో వచ్చిన విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గూడూరు పట్టణ, రూరల్‌లో	89	6499 మంది
చిల్లకూరు	71	5,220 మంది
కోట	72	5113 మంది
వాకాడు	72	2945 మంది
చిట్టమూరు	95	3,452 మంది
వెంకటగిరి నియోజకవర్గంలో..		
వెంకటగిరి	101	7,900 మంది
బాలాయపల్లి	76	3,526 మంది
డక్కిలి	71	2,986 మంది
సూళ్లూరుపేటలో నియోజకవర్గంలో..		
ఓజిలి	61	2,140 మంది
పెళ్లకూరు	65	3772 మంది
దొరవారిసత్రం	65	3,266 మంది
సూళ్లూరుపేట	70	5,180 మంది
నాయుడుపేట	75	3524 మంది

అగమ్య గోచరంగా ఫౌండేషన్ స్కూళ్ల పరిస్థితి


సంజయ్‌గాంధీ కాలనీలో ఫౌండేషన్ స్కూల్‌కు వచ్చిన ఏడుగురు విద్యార్థులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలో నూతన విద్యా విధానంలో ఏర్పాటుచేసిన ఫౌండేషన్ స్కూళ్లు 37, మోడల్ స్కూళ్లు 17, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 12, ఉన్నత పాఠశాలలు 9 వున్నాయి. 3,524 మంది పిల్లలు చదువుతున్నారు మండలంలో చాలావరకు ఫౌండేషన్ స్కూళ్లలో 3, 4, 5 తరగతులు లేకపోవడంతో చాలామంది పిల్లలు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కూచివాడ, పుదూరుమిట్టకండ్రిగలో ఎఫ్‌సీలో ఐదుగురు, మేముగుంటపాళెం, పూడేరు ఎఫ్‌సీలో 8 మంది, చిగురుపాడు, అగ్రహారం, వద్దిగుంట కండ్రిగ, విన్నమాల జీసీ ఫౌండేషన్ స్కూళ్లలో 9 మంది పిల్లలు మాత్రమే వున్నారు. పలుచోట్ల కాలనీలో ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను ఎత్తివేసి మోడల్ స్కూళ్లలో విలీనం చేశారు. తద్వారా దూరంగా వున్న పాఠశాలలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఈ నేపథ్యంలో తక్కువ మంది వుంటున్న ఫౌండేషన్ స్కూళ్లను ప్రభుత్వం నిర్వహిస్తుందా.. లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



పెళ్లకూరు: చెంబేడులో ఆరుబయట కూర్చున్న విద్యార్థులు, దొరవారిసత్రం: ఏకొల్లు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంఈవో, టీచర్లు




వెంకటగిరి రూరల్: తరగతి గదులో ఉన్న విద్యార్థులు, చిట్టమూరు: పిల్లలు రాకపోవడంతో బోసిపోయిన ఆరూరు ఉన్నత పాఠశాల, ఓజిలి: రాచపాళెంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పలువురికి పరామర్శ


సంపూర్ణమ్మకు నివాళులర్పిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం పలువురిని పరామర్శించారు. వెంకటగిరి రూరల్ మండలం పారవోలుకు చెందిన మాజీ సర్పంచ్ వీపూరు జనార్ధన్ సతీమణి సంపూర్ణమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయన వారి ఇంటికి వెళ్లి సంపూర్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మైక్‌బాషాను పరామర్శిస్తున్న నేదురుమల్లి

అదేవిధంగా పట్టణంలోని 21వ వార్డులోని వైఎస్సార్‌సీపీ నాయకుడు పఠాన్‌బాషా (మైక్‌బాషా) కుమారుడు పఠాన్ సాబ్‌జాన్ మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డక్కిలి మండల అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, కౌన్సిలర్ ఆరి శంకరయ్య, కళ్యాణి, వహిద, సుఖన్య, సదాకెడ్డి, తాజుద్దీన్, మాజీ కౌన్సిలర్ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చెట్లలోకి దూసుకెళ్లిన బస్సు



దొరవారిసత్రం: మండలంలోని కుప్పారెడ్డిపాళెం సమీపంలో వెదురుపట్టు వద్ద బుధవారం రాత్రి కంపెనీ కార్మికులను వదిలి తిరిగి వెళుతున్న బస్సు అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీసిటీలోని ఓ కంపెనీకి చెందిన కార్మికులతో బయలుదేరిన బస్సు దొరవారిసత్రం మండలం వెదురుపట్టు మీదుగా పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామం చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో కార్మికులను దించి తిరిగి వెళుతోంది. కుప్పారెడ్డిపాళెం సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కండలేరులో 37.688 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 37.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,380, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హై లెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుల యాజమాన్యంపై అవగాహన

డక్కిలి: పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని లింగసముద్రం గ్రామంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిలో కొత్త రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, భూసారా పరీక్షల ప్రాముఖ్యత, పచ్చిరొట్ట ఎరువులు యాజమాన్యం, నిమ్మలో సమగ్ర పోషక యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితరాలపై రైతులకు అవగాహన కల్పించారు. కుప్పాయిపాళెంలో కూడా కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త విజయశ్రీ అధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు మంగళదీప్, బండెప్ప, ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, రాజీవన, నాగార్జునరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది శ్రీహరి, హరిచంద్ర ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

పాఠశాలకు భూమి వితరణ

- దాతను సన్మానించిన ఎంఈవో, ఉపాధ్యాయులు


దాత వీవీఎస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

రాపూరు: మండలంలోని తెగచర్ల ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ క్రమంలో పాఠశాల నిర్మాణానికి రెండున్నర ఎకరాల పొలాన్ని పూర్వ విద్యార్థి, రోడ్డు సేఫ్టీ అండ్ ట్రాఫిక్ అడ్వైజర్ వీవీఎస్ రెడ్డి వితరణ చేశారు. ఆయనను గురువారం ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ వీవీఎస్ రెడ్డి పాఠశాలకు భూమి దానం చేయడంతో పాటు తెగచర్లలో మోడల్ ప్రైమరీ స్కూల్‌లో తాత్కాలిక గదుల నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేశారని తెలిపారు. వీవీఎస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలని కోరారు.

అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడి


స్వాధీనం చేసుకున్న జేసీబీ

సైదాపురం : సైదాపురం పంచాయతీ కమ్మవారిపల్లి చెరువు సమీపంలో వున్న వెంకటేశ్వర్లు నాయుడుకు చెందిన పొలంలో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం తవ్వుతుండగా గురువారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ క్రాంతి కుమార్ విలేకరులతో మాట్లాడుతూ కమ్మవారిపల్లి చెరువు సమీపంలో వెంకటేశ్వర్లు నాయుడుకు చెందిన నిమ్మ తోట ఉందన్నారు. అందులో క్వార్ట్జ్ ఖనిజం విస్తారంగా ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో పొలంతో పాటు చెరువులో ఎవరికీ అనుమానం రాకుండా తవ్వకాలు చేసి ఖనిజాన్ని ఒక యార్డుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తవ్వకాలు సాగిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి దక్కని గౌరవం


ఎమ్మెల్సీ పేరు లేని శిలాఫలకం

చిల్లకూరు: గూడూరు మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అధికారులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కనీస గౌరవం ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకుని గురువారం గూడూరు పట్టణం సమీపంలోని విఘ్నేశ్వరపురం వద్ద అభివృద్ధి పనుల శిలాఫలకం, ఆస్పత్రి రోడ్డులో శిలాఫలకం ఆవిష్కరించారు. వాటిలో నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్లు వేశారు. గూడూరు నియోజకవర్గానికి చెందిన వ్యక్తి, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి పేరును చేర్చకపోవడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ ఇచ్చిన ప్రొటోకాల్‌ను పాటించినట్టు తెలిపారు.

విద్యార్థినికి నగదు బహుమతి


విద్యార్థినిని అభినందిస్తున్న జేవీఎన్ ఫౌండేషన్ అధ్యక్షుడు

వెంకటగిరి రూరల్: పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని దిషికారాణికి గురువారం జేవీఎన్ ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, బార్ సత్యనారాయణ ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల హద్దుల ఏర్పాటుకు కంచెను వితరణ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సుంకర రవి పాల్గొన్నారు.

విమాన ప్రమాదం కలచివేసింది


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


మేరిగ మురళీధర్


మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

వెంకటగిరిరూరల్/నాయుడుపేటటౌన్/చిల్లకూరు: గుజరాత్ అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం కలచి వేసిందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. సాంకేతిక లోపం కారణంగా జరిగిన విమాన ప్రమాదం తీవ్రంగా కలచి వేసిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వకర్త మేరిగ మురళీధర్ అన్నారు. అహ్మదాబాద్ నుంచి లండన్ బయలు దేరిన విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే సాంకేతిక లోపం కారణంగా కుప్పకూలడం బాధకలిగించిందని వెల్లడించారు. పలువురు మృత్యువాత పడడం దురదృష్టకరమని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు అందుబాటులో నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం): వైఎస్సార్ సీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వెంకటగిరిలో ఉంటారు. కార్యకర్తలు, నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్:నాయుడుపేటలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల వల్ల శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ ఎస్.శివశంకర్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

గూడూరు రూరల్: పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ హెచ్చరించారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చెన్నూరులో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది తల్లిదండ్రులు పేదరికం కారణంగా తమ పిల్లలను పనుల్లో పెడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రమాదకరమైన పరిశ్రమల్లో కూడా పిల్లలతో పనులు చేయిస్తున్నారని, సంబంధిత పరిశ్రమలను మూసేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ జడ్జి రాజేష్, న్యాయవాదులు కోటేశ్వరరావు, హిరప్రసాద్, రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆటపాటలతో విద్య


చిల్లకూరు: అంగన్‌వాడీల ర్యాలీ


నాయుడుపేట: పిల్లలతో సీడీపీవో ఉమామహేశ్వరి తదితరులు

చిల్లకూరు/కలువాయి(సైదాపురం)/నాయుడుపేట టౌన్/రాపూరు/డక్కిలి : మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని నాయుడుపేట సీడీపీవో ఉమామహేశ్వరి, చిల్లకూరు, కలువాయి, రాపూరు, డక్కిలి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగిశెట్టి రేణుక, కొండమ్మ, రాధిక, పరిమళ తెలిపారు. చిల్లకూరులోని వడ్డిపాళెం, కలువాయి మండలం తోపుగుంట, రాపూరులోని బీసీ కాలనీ, మల్లమగుంట, డక్కిలి పంచాయతీ కందలవారిపల్లి అంగనవాడీ కేంద్రాలు, నాయుడుపేటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటలు, పాటలు, కథలతో పిల్లలకు విద్య నేర్పిస్తామని తెలిపారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. చిల్లకూరు మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది పెంచలమ్మ, విజయమ్మ, కలువాయి మండలంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది రమణమ్మ, అరుణ, నాయుడుపేటలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల సూపర్‌వైజర్లు ఆషా బేగం, హేమలత, సాయిలక్ష్మి, మణెమ్మ, పోలమ్మ, రాపూరు మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది ప్రమీల, సాబిర, ఆసిఫా, మోహతాజ్, అమరావతి, కవిత, డక్కిలిలో అంగన్‌వాడీ వర్కర్ పోలమ్మ పాల్గొన్నారు.